# సాహసి

**చీ**కట్లో వడివడిగా నడుస్తోంది సృజన. ఈ మధ్యకాలంలో ఎప్పుడూ ఇంత లేట్‌గా ఇంటికి రాలేదు.

చాలా రోజులయింది కదా... ఒకసారి చూసి వద్దామని సాయంత్రం ఆఫీస్ అవగానే కాచిగూడాలోని స్నేహితురాలి ఇంటికి వెళ్ళింది. అప్పుడు టైం ఆరున్నర.

వెళ్ళేటప్పుడు ఒక అరగంట కూర్చుని వచ్చేద్దామనే వుద్దేశ్యంతోనే వెళ్ళింది. కానీ కబుర్లలో పడ్డాక ఆ అరగంట కాస్తా గంట, గంట కాస్తా రెండు గంటలు అయింది.

అప్పుడు మెల్లగా బయల్దేరితే తలుపు దగ్గర వీడుకోలు ప్రహసనం మరో అరగంట నడిచింది. వెరసి కోఠి వచ్చేసరికే తొమ్మిదిన్నర అయింది.

లాస్ట్ బస్ తొమ్మిదీ నలభైకి. బస్‌స్టాప్‌కి రాగానే టైం చూసుకుని ఒక పదినిమిషాలు ముందే రాగలిగినందుకు "అమ్మయ్య!" అనుకుంది. కానీ ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. పావుగంట నిల్చున్నా బస్ రాలేదు.

బస్‌స్టాప్‌లో ఆడవాళ్ళు మెల్ల మెల్లగా తగ్గిపోసాగారు. "కొంపదీసి బస్ వెళ్ళిపోలేదు కదా!" అనుకోగానే సృజన గుండెలు గుభిల్లుమన్నాయి.

"ఎలా! ఈ టైంలో ఆటోలో వెళ్లడం కూడా భయమే!" అనుకుంది దడదడలాడే గుండెలతో.

"ఇంటికి ఫోన్ చేస్తే!" అన్న ఆలోచన ఒక్క క్షణం మనసులో కదలాడింది. పబ్లిక్ టెలిఫోన్ కోసం ఆమె కళ్ళు ఆత్రంగా వెతుకుతూండగానే మళ్ళీ ఆమెకే, "ఫోన్ చేసి ఏం లాభం!" అనిపించింది.

"ఇక్కడి వరకూ వచ్చి తనని తీసుకు వెళ్లగలిగే వాళ్ళెవరూ లేరు. నాన్నగారి ఆరోగ్యం బాగాలేదు. అమ్మ, నాయనమ్మ ఇంత రాత్రి పూట బయటికి రాగలిగేవాళ్ళు కారు. అన్నయ్య వుండుంటే ఏ ఫ్రెండుదన్నా బండి తీసుకుని వచ్చేవాడేమో! కానీ వాడు వూర్లో లేడు. ఎలాగోలా తనే యింటికి చేరాలి తప్ప ఫోన్ చేసి లాభం లేదు. అనవసరంగా ఇంట్లో వాళ్ళని కంగారు పెట్టడమే అవుతుంది".

ఈ ధోరణిలో ఆమె ఆలోచిస్తూండగానే... దూరంగా బస్ వస్తూ కనిపించింది. దాని మీద చిరపరిచితమయిన బోర్డుని అంత దూరంనుంచే గుర్తుపట్టిన సృజన నిశ్చింతగా నిట్టూర్చింది.

"కాలనీ బస్! వస్తోంది!" అనుకుంది స్థిమితపడ్డ గుండె వేగంతో. బస్‌లో ఎక్కగానే ఇక దాదాపు ఇంటికి చేరినట్లే అనిపించింది.

పదీ నలభైకి కాలనీలో బస్ దిగి, ఇంటి వైపు నడుస్తుంటే... అప్పటివరకూ మనసంతా నిండిన భయం మెల్లగా తగ్గి, ఆ స్థానాన్ని గర్వం ఆక్రమించసాగింది.

"పదీ నలభై, ఇంటికెళ్లేసరికి పదీ యాభై అవుతుంది. అంటే దాదాపు పదకొండు. దాదాపు ఏముంది! పూర్తిగా పదకొండే! తన వాచీ పదినిమిషాలు స్లోగా నడుస్తోంది. పదకొండంటే... అర్ధరాత్రికి ఒక్క గంటే తక్కువ. ఈ టైంలో తను ఒంటరిగా ఇంటికి వెళ్తోంది!

రోడ్డు మీద ఆడవాళ్ళు కాదు కదా! అసలు జనసంచారమే లేదు. చాలా భాగం ఇళ్ళు చీకట్లో కప్పబడి వున్నాయి.

ఒకటీ అరా ఇళ్ళల్లో వెలుగు కనబడుతున్నా.. అది ఏదో ఒక్క గదిలోనుంచే. అర్ధరాత్రి దాకా టి.వి. చూసే మగవాళ్ళో, చదువుకునే పిల్లలో మెలకువతో వుండుంటారు. మిగతా వాళ్ళంతా నిద్రపోతూ వుండుంటారు. ఇలాంటి సమయంలో.. తను వొంటరిగా... ఏ భయమూ లేకుండా నడుస్తోంది.

ఎవరికుంటుంది ఇంత ధైర్యం! తను కాబట్టి ఇంత ధైర్యంగా వచ్చింది. ఆ కోఠీ దగ్గర్లో వున్న ఏ చుట్టాలింటికో, ఫ్రెండ్సింటికో వెళ్ళి శరణు అడగకుండా... ఇంటికి ఫోన్ చేసి ఇంట్లో వాళ్ళని కంగారు పెట్టకుండా... ఇంత దూరంలో వున్న కాలనీకి భయం లేకుండా వచ్చిందంటే... తను ఎంతో ధైర్యస్థురాలు కాబట్టే!" గర్వంగా అనుకుంది సృజన.

"అర్ధరాత్రి ఆడవాళ్ళు స్వేచ్ఛగా నడవగలిగినప్పుడు... అంటూ అదేదో పెద్ద అపూర్వమయిన విషయంలా చెప్తారు. ఏముంది అంత కష్టం! ఇపుడు తను రాలేదూ! మనసులో ధైర్యం వుండాలి కానీ సాధించలేనిది ఏమీలేదు" ఇంట్లో అడుగుపెడ్తూ మరింత ఆత్మవిశ్వాసంతో అనుకుంది.

ఆమె గేటు తీస్తూన్న చప్పుడుకే డ్రాయింగ్‌రూమ్‌లో లైటు వెలిగింది. కాలింగ్ బెల్ నొక్కకముందే తలుపు తెరుచుకుంది. "ఏమిటే ఇంత ఆలస్యం!" అంది సత్యవతి మనవరాలిని చూస్తూనే.

సృజన మొహం చిట్లించింది. ఆవిడ మాట వినబడనట్లే లోపలికి నడుస్తూ... "అమ్మా! అన్నం పెట్టు... ఆకలేస్తోంది" అంది అరచినట్లుగా.

ఇంట్లోకి అడుగు పెట్టగానే నాయనమ్మ ఎదురు రావడం... ఆ అర్థం లేని ప్రశ్న వేయడం సృజనకి నచ్చలేదు.

అలాంటి గదమాయింపులు చిన్నప్పటి నుంచీ అసలు అలవాటులేవు సృజనకి. తల్లీ తండ్రి చాలా స్వేచ్ఛతో పెంచారామెని. ఎక్కడికి వెళ్ళదల్చుకున్నా ఫలానా చోటుకి వెళ్తున్నానని కేవలం చెప్పడమే కాని... పర్మిషన్ అడగడం మాత్రం ఎప్పుడూ లేదు.

ఆమె విచక్షణ మీదా, వ్యక్తిత్వం మీదా చాలా నమ్మకం చూపిస్తారు వాళ్లు. తల్లిదండ్రుల దగ్గర అలాంటి నమ్మకాన్ని సాధించుకోగలిగినందుకు తనని చూసి తనే చాలా గర్వపడుతూ వుంటుంది సృజన.

ఒక్క అరగంట ఆలస్యంగా ఇంటికి వెళ్ళినా... ఇంట్లో వాళ్లు వంద ప్రశ్నలు వేస్తారని చెప్పే స్నేహితురాళ్లని చూస్తే... మొన్న మొన్నటివరకూ ఆమెకి చాలా హేళనగా వుండేది. అలాంటిది... నాయనమ్మ వచ్చినప్పటినుంచీ పరిస్థితి మారిపోయింది.

మూడు నెలల క్రితం వరకూ ఆవిడ స్వంత వూర్లోనే వుండేది. వయసు పెరిగిందనీ, ఇక అక్కడ వొంటరిగా వుండడం మంచిది కాదనీ అనిపించాక... ఇపుడు అక్కడ ఇల్లు అమ్మేసి హైదరాబాద్ చేరింది.

ఆవిడ రావడం సృజనకీ ఇష్టమే. ఆవిడ మాటలు... ఆవిడ చేసిపెట్టే వంటలు, పాడే పాటలు... అన్నీ ఇష్టమే. కాకపోతే... ఇదిగో ఇలాంటి ప్రశ్నలే చిరాకు కలిగిస్తాయి.

"ఆడపిల్ల అంటే ఇలా వుండాలి... ఆడపిల్ల అంటే అలా వుండాలి" అని ఆవిడ ఇచ్చే ఉపన్యాసాలు సరదాగా వినడానికయితే బాగానే వుంటాయి. కానీ, ఆచరించాలంటే ఎక్కడ కుదురుతుంది!

"అణకువ... పొందిక... ఒద్దిక... అంటూ ఏమిటో కొత్త కొత్త పదాలన్నీ చెప్తుంది".

మొహం చిట్లింపుతోనే అన్నం తింటున్న మనవరాలికి కూర వడ్డిస్తూ... "మరీ ఇంత రాత్రి వరకూ ఇంటికి రాకపోతే కంగారుగా వుండదుటే!" అంది మళ్ళీ సత్యవతి.

"ఎందుకు కంగారు!" విసురుగా ప్రశ్నించింది సృజన.

"ఆడపిల్లవి కాబట్టే" సత్యవతి దీర్ఘం తీసింది.

"భయపడటానికి ఆడపిల్ల ఏమిటి! మగపిల్లాడేమిటి! ఎవరైనా భయపడచ్చు. మగపిల్లల్లో పిరికివాళ్ళుండరా!" సృజన హేళనగా అడిగింది.

"నేను చెప్పేది నీ భయం గురించి కాదే! మా భయం గురించి" సత్యవతి నవ్వుతూ చూసింది.

"ఆడపిల్లలు చీకటి పడేసరికి ఇల్లు చేరకపోతే బెరుకుగా వుంటుంది" ఆవిడ నచ్చచెప్తున్నట్లుగా చెప్తుంటే... ఆవిడ మాట పూర్తికాకముందే, "రోజూ చీకటి పడక ముందే వస్తున్నాగా!" అంది సృజన విసురుగా.

"నేనేం అనవసరంగా రోడ్లు పట్టుకు తిరగను. చాలా రోజుల తర్వాత... ఇవాళ మా ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళాను. అక్కడ కూర్చున్నది కూడా రెండు గంటలే. అయినా ఈ టైమ్ అయిపోయింది" ఒక పక్క పరుషంగా మాట్లాడుతున్నా మరోపక్క సృజన గొంతు రుద్ధమయింది.

"నేనేమన్నానే ఇపుడు!" అంది సత్యవతి బిక్కమొహంతో.

"త్వరగా వస్తే... కంగారుండదు కదా... అని" నసిగినట్లుగా అని అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఒక్క క్షణం అలాగే నిశ్చలంగా కూర్చుండిపోయింది సృజన. చేతిలోని ముద్ద చేతిలోనూ, నోటిలోని ముద్ద నోటిలోనూ ఆగిపోయాయి.

"తిను, తిను... అన్నం తిను" తల్లి హెచ్చరించడం వినబడి ఆమె వైపు బేలగా చూసింది సృజన. "ఏమిటమ్మా నాయనమ్మ... నేనేదో తప్పుచేసినట్లు అన్నిసార్లు అడుగుతుంది... నా మంచి చెడ్డలు నాకు తెలీవా!" అంది అసహనాన్నీ, బాధనీ కలగలిపి.

ఇంత రాత్రివేళ, తను భయపడకుండా, ధైర్యంగా ఇంటికి వస్తే... అందుకు మెచ్చుకోవలసింది పోయి, ఎదురు నిందారోపణలు చేస్తుంటే... భరించడం కష్టంగా తోచింది సృజనకి.

కనీసం తల్లి అయినా దాన్ని గుర్తిస్తే బాగుండుననీ, నాయనమ్మని అలాంటి ప్రశ్నలు అడగకుండా వారిస్తే బాగుండుననీ అనిపించింది.

"ఏదోలే... పెద్దావిడ కదా... కొంచెం భయపడతారు" అంది సుశీల నచ్చచెప్తున్నట్లుగా.

సృజన బాధ కొంత చల్లారింది. తల్లి నుంచి ఇంకొంచెం మెప్పుని ఆశిస్తూ... "నీకు తెలీదా అమ్మా! బయటికి వెళ్తే నేనెంత జాగ్రత్తగా వుంటానో!" అంది.

సుశీల నవ్వింది. "సర్లేవే. పన్నెండవుతోంది. త్వరగా అన్నం తిని పడుకో. ఆవిడ మాటలు ఎందుకు పట్టించుకుంటావు నువ్వు! వాళ్ల రోజులు వేరు. ఈ రోజులు వేరు. అప్పట్లో ఆడవాళ్లు ఇల్లు కదిలి వెళ్ళడమంటేనే ఒక అద్భుతం. ఇలా అర్ధరాత్రి దాకా బయట వుండడమనే విషయాన్ని ఆ వయసు వాళ్లు జీర్ణించుకోవడమంటే కష్టమే మరి! చదువుకుని ఉద్యోగం చేసే మీలాంటి పిల్లలకి వుండే ధైర్యం పెద్దవాళ్లకెలా వుంటుంది! ఆ విషయం అర్థం చేసుకోవాలి నువ్వు".

తల్లి స్వరంలో మందలింపు ధ్వనించినా, తనకేదో నీతిబోధ చేస్తున్నట్లుగా అనిపించినా, మొత్తం మీద ఆవిడ సమాధానం మాత్రం సృజనకి నచ్చింది.

"... నాయనమ్మ పిరికిది. నువ్వు ధైర్యస్థురాలివి. నువ్వు ఆవిడ మాటల్ని పట్టించుకోవలసిన అవసరం లేదు" అన్న సారాంశాన్ని తల్లి మాటల్లో నుంచి గ్రహించుకుని, తృప్తిగా నవ్వుకుంది సృజన.

ఆ హుషారుతోనే గబగబా అన్నం తినేసి నిద్రకి ఉపక్రమించింది.

✧ ✧ ✧

మర్నాడు సృజన నిద్రలేచేసరికి సత్యవతీ, సుశీలా హడావిడిగా పనులు చేసుకుంటూ కనిపించారు. వాళ్ళ హడావిడి చూసిన తర్వాత గుర్తొచ్చింది సృజనకి ఆ రోజు శ్రీరామ నవమి అని.

ప్రతిసారీ ఇంత హడావిడి వుండదు ఈ పండుగకి. ఇంట్లో అందరూ ఉద్యోగాలు చేయడం మొదలు పెట్టాక, ఇలాంటి చిన్న చిన్న పండుగలు జరుపుకునే అలవాటు తగ్గిపోయింది. పెద్ద పండుగలు నాలుగూ జరుపుకోవడమే గగనమవుతోంది.

"ఈసారి నాయనమ్మ వుందిగా! అందుకే" అనుకుంది సృజన. వాకిట్లో పెద్ద ముగ్గుతో, గుమ్మాలకి మామిడాకులతో కళకళలాడుతున్న ఇంటిని చూస్తూ.

"ఇవాళ సెలవు పెట్టకూడదూ!" అంది సుశీల సృజన ఆఫీసుకి తయారవడం గమనించి.

"కుదరదమ్మా!" అంది సృజన దిగులుగా. నిజానికి సృజనకి కూడా ఆఫీసు మానేసి పండుగని ఎంజాయ్ చేయాలని అనిపిస్తోంది. కానీ ఆఫీసులో ఈ రోజే తప్పకుండా పూర్తిచేయాల్సిన పని ఒకటి వుంది.

"పోనీ భోజనానికి వచ్చేయడం కుదురుతుందా! నువు వెళ్ళేలోపల వంట కాదు"

సుశీల పశ్న విని సృజన పర్లేదన్నట్లుగా తల ఆడించింది. "మూడింటికి పర్మిషన్ తీసుకుని వస్తాలే" అంది.

"నువ్వు అక్కడ మూడింటికి బయల్దేరినా ఇంటికి వచ్చేసరికి నాలుగవుతుంది కదే! అప్పటిదాకా అన్నం తినకుండా ఎలా వుంటావు?" అంది సత్యవతి ఆందోళనగా.

సృజన నిర్లక్ష్యంగా నవ్వింది. "ఏంటి నాయనమ్మా! ప్రతి చిన్న విషయానికీ కంగారు పడతావు! ఏ విషయానికి భయపడాలో, దేనికి ధైర్యంగా వుండాలో అస్సలు తెలీదు నీకు" అంది సృజన కొంచెం హేళన ధ్వనించే కంఠంతో.

"నిజమే. నాకేం తెలుస్తుంది! నీలాగా నేనేమన్నా బయట తిరుగుతున్నానా! ప్రపంచాన్ని చూస్తున్నానా! సీతారామా అనుకుంటూ ఒక మూల కూర్చుంటున్నాను కానీ!" సత్యవతి దీర్ఘం తీస్తున్నట్లుగా అంది.

సృజన తడబాటుగా చూసింది. "రాత్రి అమ్మ నాతో చెప్పిన మాటలు నాయనమ్మ విందా ఏమిటి?" అనుకుంది కొంచెం జంకుగా.

తాము మాట్లాడుకున్న మాటలు విని, ఇప్పుడు వ్యంగ్యంగా సమాధానం చెప్పడం లేదు కదా! అన్న అనుమానంతో సత్యవతి మొహాన్ని పరికించింది.

కానీ అలాంటి సూచనలేమీ ఆవిడ మొహంలో కనబడలేదు.

దానితో సృజన మళ్ళీ తన మామూలు ధోరణిలోకి వచ్చి, "సీతారామా అని వూరికే అనుకోవడం కాదు నాయనమ్మా! ఆ మాటలు అనుకునేటప్పుడు వాళ్ల వ్యక్తిత్వాలని అర్థం చేసుకోవాలి. "బయట తిరుగుతావు, బయట తిరుగుతావు" అని నన్ను వూరికే దెప్పుతావు కానీ... సీతమ్మవారు మాత్రం దాటలేదా లక్ష్మణరేఖ! నేను

ఆ మాట అంటే, మళ్ళీ, అందుకే అలా కష్టాలు పడింది... అంటావు కాబోలు! అక్కడ అర్థం చేసుకోవలసింది అది కాదు. తాను మంచి అనుకున్న పనిని ఆవిడ ఎంత ధైర్యంగా చేసిందీ! అన్న విషయాన్ని అర్థం చేసుకోవాలి. భిక్షవేయాలి అనుకుంది, వేసింది. తర్వాత అనుకోని ప్రమాదం వచ్చిందంటే అది వేరే విషయం. దాన్ని ఈ విషయానికి ముడి పెట్టకూడదు".

గడగడా చెప్తున్న సృజన ఒక్కసారి ఆగి వూపిరి తీసుకుంది. మిగతావాళ్ళిద్దరూ అసలు తన మాటలు వింటున్నారో, లేదో అర్థం కాలేదు. తదేక దీక్షతో ఒకళ్లు బియ్యం ఏరుతుంటే, మరొకళ్లు గారెలకి పప్పు రుబ్బుతున్నారు.

"అదికాదే! ఇంతకీ ఇవాళ నీ భోజనం ఎట్లా అని!" అంది సత్యవతి తాపీగా. అంతకు ముందు జరిగిన మాటలకి అసలేమీ సంబంధం లేకుండా.

ఒక్క క్షణం సృజనకి చాలా కోపం వచ్చింది. తను ఇంత అనర్గళంగా, అద్భుతంగా మాట్లాడితే, అదేమీ పట్టించుకోకుండా... ఆవిడ అంతకు ముందరి టాపిక్‌లోనే ఆగిపోవడం అసలేమీ నచ్చలేదు.

కానీ అంతలోనే ఫక్కున నవ్వొచ్చింది. "నేనింత పెద్ద పెద్ద మాటలు మాట్లాడితే, నాయనమ్మకేం అర్థమవుతుంది పాపం!" అనుకుంది జాలిగా.

"ఇదే మరి రామాయణమంతా విని రాముడికి సీతేమవుతుందని అడగడమంటే!... అంత ఆకలేస్తే బయట ఏమన్నా టిఫిన్ చేస్తాను కదా నాయనమ్మా!" అంది అపహాస్యమూ, ఆప్యాయతా కలగలిపిన స్వరంతో.

"ఏంటో ఇవాళ అన్నీ రాముడికీ సీతకీ సంబంధించిన పోలికలే వస్తున్నాయి" స్వగతంగా అనుకుంటూ సృజన ఇవతలికి రాబోతుంటే... ఆమె అపహాస్యాన్ని ఎంత మాత్రమూ పట్టించుకోకుండా... తన ధోరణిలో తను సమాధానం చెప్పింది సత్యవతి. "ఆ పని చేయి, ఏమన్నా తిను. కడుపు మాడ్చుకోకు" అంది.

క్షణం తర్వాత మళ్ళీ తనే, "రాముడూ, సీతా గుర్తొస్తే మంచిదేలే! శ్రీరామనవమి నాడు వాళ్ళ గురించి ఎన్ని సార్లు చెప్పుకుంటే అంత పుణ్యం!" అంది.

ఆ మాటలు పూర్తిగా వినకుండానే సృజన ఆ గదిలోనుంచి బయటకు నడిచింది.

స్నానం చేసి, ఈ మధ్యనే కొన్న కొత్త చుడిదార్ వేసుకుని ఆఫీసుకి బయల్దేరింది. చెప్పులు వేసుకుంటూ "అమ్మా! ఎలా వుంది డ్రెస్!" అని అడిగింది.

"చాలా బాగుంది" సత్యవతీ, సుశీలా ఏక కంఠంతో చెప్పారు.

చిరునవ్వుతో బయటకి నడిచింది సృజన. "షాపులో చూడగానే ఈ రంగూ, డిజైనూ తనకి చాలా బాగా నచ్చాయి. అదీగాక టైలర్ కూడా చాలా బాగా కుట్టాడీసారి! అందుకే డ్రెస్‌కి చాలా అందం వచ్చింది" రోడ్డు మీద కూడా ప్రతివాళ్ళూ తనని మరొొక్కసారి తిరిగి చూడటం గమనించి తృప్తిగా అనుకుంది సృజన.

ఆఫీసులో కూడా రోజంతా చాలా ఆనందంగా గడిచింది. పనికూడా అనుకున్నదానికంటే ముందే అయిపోయింది.

రెండున్నర అవుతూండగా పర్మిషన్ తీసుకుని బయటికి వచ్చింది సృజన. బస్‌స్టాప్ దాకా ఎండలో నడిచినా, బస్ ఎక్కగానే చాలా హాయిగా అనిపించింది.

బస్‌లో కూడా పెద్దగా రష్ లేదు. లేడీస్ సీట్స్‌లో చివరి సీట్ దగ్గరికి వెళ్ళి, కిటికీ పక్కన కూర్చుంది సృజన.

పొద్దున్నుంచీ ఏమీ తినకపోవడంతో కొంచెం నీరసంగా వున్నా మనసు మాత్రం చాలా ఆహ్లాదంగా వుంది.

ఇంటికి వెళ్ళి సుష్టుగా భోజనంచేసి, మంచం మీద వాలి... రేడియో వింటూ.. ఏదైనా మంచి పుస్తకం చదువుకుంటూ... చాలా రోజుల తర్వాత దొరికిన తీరిక సమయాన్ని ఎలా గడపచ్చో తల్చుకుంటేనే సృజన మనసు ఆనందంతో గంతులేసింది.

తను దిగవలసిన స్టాప్ వస్తూండటంతో సీట్‌లో నిటారుగా కూర్చుంది సృజన, దిగేందుకు సిద్ధమవుతూ.

సరిగ్గా అప్పుడే తన వెనకసీట్లో కూర్చున్న మగపిల్లలిద్దరూ లేచి నిలబడడం సృజనకి లీలగా తెలిసింది. ఆ మరుక్షణం వాళ్ళలో ఒకతని చేయి వేగంగా ముందుకు వచ్చి సృజన గుండెలని మొరటుగా నలిపి వెనక్కి వెళ్ళింది.

ఒక్కక్షణం... ఒకే ఒక్క క్షణం సృజనకి ఏం జరిగిందో అర్థం కాలేదు. ఆమె కళ్ళు తిప్పి చూసేసరికి, ఇద్దరు యువకులు వెనకవున్న జనంలోకి మాయమవడం... బస్ పూర్తిగా ఆగకముందే బస్ దిగేయడం కనిపించింది.

పూర్తి అయోమయావస్థలో తను కూడా అప్రయత్నంగా బస్ దిగేసింది సృజన. దిగాక ఒక్క క్షణం అలాగే నిశ్చలంగా నిలబడిపోయింది. అవమానంతో, కంపరంతో ఆమె శరీరం కంపించసాగింది.

పట్టపగలు.. అంతమంది జనం మధ్య వాళ్లు అలాంటి పని చేశారన్న విషయం ఒకవైపు, వాళ్ళు అంత అసహ్యంగా ప్రవర్తించినా, తను తిరిగి వాళ్ళని ఏమీ చేయలేకపోయిందన్న వాస్తవం మరోవైపు సృజన మనసుని మండించసాగాయి. కాళ్ళు అలవాటుగా ఇంటివైపు నడుస్తున్నా, ఆలోచనలు మాత్రం ఆమె మనసుని అల్లకల్లోలం చేయసాగాయి.

"అయిదు నిమిషాల క్రితం వరకూ తను ఎంత ఆనందంగా వుంది! క్షణంలో ఆ ఆనందాన్నంతా పాడు చేశారు వాళ్ళు... కానీ తను మాత్రం వాళ్ళకి తిరిగి గుణపాఠం చెప్పలేకపోయింది. వాళ్లు మళ్లీ కనిపిస్తే, శక్తి కొద్దీ చెంపలు వాయగొట్టాలని వుంది.

"కానీ ఎందుకు కనబడతారు! కనబడినా తను ఎలా గుర్తు పడుతుంది! ఎంత దారుణం! పట్టపగలు! ఇంకెవరైనా గమనించారో లేదో తెలీదు. గమనించి వుండకపోవచ్చు. గమనిస్తే వాళ్ళని పట్టుకునే వాళ్ళేగా! ఏమో! ఎందుకు పట్టుకుంటారు! ఎవరికి వాళ్ళు తమకెందుకని వూరుకుంటారే కానీ మరొకరి విషయంలో ఎందుకు తలదూరుస్తారు! కానీ ఒక్కటి మాత్రం నిజం! ఎవరైనా చూసివుంటే వాళ్ళనేమైనా చేస్తారో లేదో కానీ తన మీద మాత్రం చులకన భావం ఏర్పర్చుకుంటారు. తప్పు చేసింది వాళ్లైనా తననే ఎగతాళి చేస్తారు.

"ఎంత బాధాకరమైన విషయం ఇది! కనీసం తను ఎవరికీ చెప్పుకోను కూడా చెప్పుకోలేదు ఈ బాధని! ఎవరికి చెప్పుకుంటుంది! ఈ విషయం తెలిస్తే ప్రాణస్నేహితురాళ్ళతో సహా అందరికీ ఎగతాళేగా!

"స్నేహితురాళ్ళేమిటి! ఇంట్లో వాళ్ళు మాత్రం! నాయనమ్మ వింటే... మొదటే మొదలు పెడుతుంది....అందుకే ఆడపిల్లలు చీకటిపడకముందే ఇంటికి రావాలి..." అంటూ ఉపన్యాసం!

సృజన కళ్ళల్లో నీళ్ళు నిండాయి. "చీకటి పడటమేమిటి! ఇపుడు ఇది జరిగింది పట్టపగలు కాదూ! దీనికేమంటారు! ఈ విషయం చెప్తే ఇక పగలు కూడా బయటకి వెళ్ళకూడదంటారా!" ఆలోచనలతో, అవమానంతో ఎర్రబడ్డ మొహంతో సృజన ఇంట్లో అడుగుపెడుతుంటే... సుశీల ఎదురొచ్చింది.

నేరుగా తన గదిలోకి వెళ్ళిపోతున్న సృజన వాలకం చూసి, "ఏంటమ్మా! ఏమయింది!" అంది. తన వెనకే గదిలోకి వచ్చిన తల్లిని కావలించుకుని, భోరుమంది సృజన.

ఒక అయిదు నిమిషాలపాటు ఆమె దుఃఖం ఆగలేదు. నోటంబడి మాటా రాలేదు. ఆ తర్వాత కూడా కళ్ళల్లో నుంచి నీళ్ళు వుబికి వుబికి వస్తుంటే... వెక్కిళ్ళ మధ్య మెల్లగా జరిగిన విషయం చెప్పింది.

"సరేలే, ముందొచ్చి అన్నం తిను" గుమ్మంలో నుంచి వినబడ్డ మాటలకి వులిక్కిపడి తల్లి వొడిలోనుంచి తల ఎత్తింది సృజన.

అక్కడ సత్యవతిని చూడగానే సృజన మొహం రక్తం లేనట్లూ పాలిపోయింది.

"అయిపోయింది. తను ఏదైతే జరగకూడదనుకుందో అదే జరిగింది. నాయనమ్మ మొత్తం వినేసింది. ఇక ముందు తనని ఎంత అసహ్యంగా చూస్తుందో! ఒక అబ్బాయి తనని అలా ముట్టుకున్నాడని తెలిసిన తర్వాత ఇక తనని అసలు మనిషిలా చూస్తుందా!"

కళ్ళు విప్పార్చుకుని సృజన అలా చూస్తుండగానే, "వెళ్ళవే. వెళ్ళి దానికి అన్నం పెట్టు" అంది సత్యవతి సుశీల వైపు చూస్తూ.

సుశీల బయటకి వెళ్ళగానే, సత్యవతి సృజన దగ్గరగా నడిచి "లే, చూడు కళ్లు ఎలా వాచాయో! లేచి మొహం కడుక్కుని బట్టలు మార్చుకో. అన్నం తిందువుగాని" అంది.

"అన్నం! అన్నం! అన్నం! అదొక్కటే పట్టింది నీకు!" సృజన కీచుగా అరిచింది. ఆమె గొంతులోనుంచి మళ్ళీ ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది.

తనకి ఇంత అవమానం జరిగితే... ఆవిడ ఏమీ పట్టించుకోకపోగా... ఓదార్చకపోగా... పైపెచ్చు ఎగతాళి చేస్తోందనుకోగానే సృజన దుఃఖం మరీ ఎక్కువయింది.

దిండుకి మొహం వొత్తిపెట్టుకుని సృజన వెక్కి వెక్కి ఏడుస్తుంటే... "సరే... నీ ఇష్టం. పులిహోర, గారెలు, బొబ్బట్లు చేశాను. అన్నీ నీకు ఇష్టమయినవే" అంది సత్యవతి అక్కడి నుంచి కదులుతూ.

ఆ మాటలు తట్టుకోలేనట్లూ సృజన ఒక్కసారి విసురుగా లేచి నిలబడింది. పూనకం వచ్చినట్లుగా అదేవేగంతో సత్యవతిని ఒక్క తోపు తోసింది.

అదాటుగా నిలుచున్న సత్యవతి మంచం మీదికి అడ్డంగా పడిపోయింది. క్షణం తర్వాత ఆవేశం తగ్గిన సృజన... నడుము సర్దుకుంటూ బాధగా లేచి కూర్చుంటున్న సత్యవతిని భయంగా చూసింది.

"సారీ నాయనమ్మా!" ఆమె పెదవులు అస్పష్టంగా కదిలాయి.

సత్యవతి ఆ క్షమాపణని వినిపించుకోలేదు. తన మామూలు ధోరణిలో "ఓసి నీ దుంపతెగా! ఎంత తోపు తోశావే! ఇదేం విడ్డూరం! ఇంత బాధపడిపోతున్నావు! ఇదేమైనా కొత్త విషయమా! అవకాశం దొరికితే మగపిల్లలు ఆడపిల్లల్తో అలాగే ప్రవర్తిస్తారు. నువు మొదటిదానివీ కాదు... చివరి దానివీ కాదు. దానికి ఇంత గోల పడిపోవాలా!" ఆశ్చర్యంగా అంటూ బయటకి నడిచింది.

గడప దాటుతూ మరోసారి "రా. త్వరగా వచ్చి అన్నం తిను" అంది.

గది మధ్యలో చలనం లేకుండా నిలబడ్డ సృజన చెవుల్లో సత్యవతి మాటలు తారకమంత్రంలా పదే పదే వినిపించాయి.

"మగపిల్లలంటే అంతే... నువ్వేమైనా మొదటి దానివా!..." ఎంత ఈజీగా అంది! ఎంత తేలిగ్గా తీసుకుంది ఆవిడ ఈ విషయాన్ని! తను గంట నుంచీ బాధపడుతూన్న విషయం ఇపుడు ఆవిడ మాటలు విన్న తర్వాత ఆలోచిస్తే... అసలు బాధ పడాల్సిన విషయమే కాదనిపిస్తోంది. ఆవేశపడాల్సిన అవసరమే లేదనిపిస్తోంది.

ఊరికే సీతారామా అనుకోవడం కాదు... వాళ్ళ వ్యక్తిత్వాలని అర్థం చేసుకోవాలి అంటూ పొద్దున నాయనమ్మని హేళన చేసింది తను.

కానీ ఇపుడు అర్థమవుతోంది... వాళ్ల వ్యక్తిత్వాలని అర్థం చేసుకోవాల్సింది ఆవిడ కాదు, తను. ధైర్యం అంటే ఏమిటో తెలుసుకోవలసింది, ధైర్యాన్ని అలవర్చుకోవలసిందీ ఆవిడ కాదు... తను.

లక్ష్మణరేఖ దాటడంలో సీత ఎంత ధైర్యం చూపించిందో చూడమంటూ... నాయనమ్మకి ఉద్బోధచేసింది తను పొద్దున.

సీతమ్మ ధైర్యవంతురాలే. అందులో సందేహం లేదు. కానీ ఆవిడ ధైర్యం నిరూపణ అయింది అక్కడ కాదు. లక్ష్మణరేఖ దాటడంలో ధైర్యం లేదు. అక్కడ ఆవిడకి ప్రమాదం గురించిన ఊహ కూడా లేదు.

ఆవిడ ధైర్యం నిరూపణ అయింది లంకలో. అంతమంది రాక్షసుల మధ్య రావణుడి వేధింపుల మధ్య... నిబ్బరంగా నిలబడినప్పుడు.

ధైర్యం అంటే ప్రమాదం రాకముందు చూపించేది కాదు. ప్రమాదం వచ్చిన తరువాత... ప్రమాదాన్ని ఎదుర్కొంటూన్నప్పుడు చూపించేది.

ప్రమాదంలో నుంచి త్వరగా బయటపడడం... దాన్ని గురించి బాధ పడకపోవడం... ధైర్యం.

సత్యవతి మాటల సారాంశం అర్థమవగానే సృజన పెదవుల మీద చిరునవ్వు మెరిసింది.

మనస్సు మళ్లీ ఆహ్లాదంతో నిండింది. శరీరాన్ని అప్పటివరకూ ఆవరించి వున్న కంపరం వదిలిపోయినట్లూ... నిజమైన సాహసం తనలో నిండినట్లూ అనిపించింది.

ఒక్క అంగలో బాత్రూమ్‌లోకి వెళ్ళి, కాళ్ళూ మొహమూ కడుక్కుంటూ... "నాయనమ్మా అన్నం పెట్టు... నేనొచ్చేస్తున్నా!" అని కేకపెట్టింది.

<u>రచనాకాలం : 2000</u>